క్లుప్తంగా

గృహ నిర్మాణ లబ్ధిదారులకు అదనపు సాయం

గుడివాడరూరల్: ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ ఇతర ప్రత్యేక గిరిజన గృహ నిర్మాణ లబ్ధిదారులకు అదనపు ఆర్థిక సాయం అందించేందుకు ఉత్తర్వులు జారీ చేసిందని ఎంపీడీఓ విష్ణుప్రసాద్ శనివారం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు, ప్రత్యేక గిరిజన లబ్ధిదారులకు రూ.లక్ష అదనపు ఆర్థిక సాయం అందజేస్తుందన్నారు. ఈ నగదు మొత్తం ఒకేసారి కాకుండా గృహ నిర్మాణ దశల్లో పునాది మొదలుకుని నిర్మాణం పూర్తయ్యే వరకు లబ్ధిదారులకు చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్ణయం వల్ల మండలంలోని 606మంది బీసీ, 562మంది ఎస్సీ, 15మంది ఎస్టీ లబ్ధిదారులకు అదనంగా లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు.

ముగిసిన ఇంటర్మీడియెట్ పరీక్షలు

పామర్రు: పామర్రులో ఈనెల ఒకటో తేదీన ప్రారంభమైన ఇంటర్మీడియెట్ పరీక్షలు శనివారంతో ముగిశాయి. ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు పూర్తి చేసినట్లు పరీక్షల చీఫ్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ పరీక్షలకు 201 మందికి 192 మంది హాజరు కాగా 9 మంది గైరు హాజరయ్యారని పేర్కొన్నారు. ఈ నెల 18వ తేదీన ఒకేషనల్ కోర్సుకు సంబంధించి పరీక్ష జరుగుతుందని తెలిపారు.

అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



నిభానుపూడి(పామర్రు): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సేవలను నేటి తరం వారు అందరూ ఆదర్శంగా తీసుకోవాలని పామర్రు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ అన్నారు. మండలంలోని నిభానుపూడి గ్రామంలోని జగనన్న కాలనీలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికులు విశ్రాంత హౌసింగ్ ఏఈ దాసరి రామ కోటేశ్వరరావు, రమాదేవిల తల్లిదండ్రులు దాసరి వెంకటేష్ లలితాబాయమ్మ, కుమారుడు దాసరి వెంకన్నబాబు లక్ష్మీ ప్రసన్నల జ్ఞాపకార్థంగా అంబేడ్కర్ విగ్రహాన్ని కాలనీ వాసులకు బహూకరించారు. కార్యక్రమంలో స్థానికులు దాసరి సాయిబాబు, ఆరిసే కోటేశ్వరరావు, దాసి దుర్గభాస్కర్, ఓంకార్, పూర్ణకృష్ణ, నాంచారయ్య, డాలి, నాంచారయ్య, వీరాంజనేయులు, కోటేశ్వరరావు, సాయికృష్ణ, మాధవ, దళిత నాయకులు సుబ్రమణ్యం, శ్రీనివాసరావు, జార్జి పాల్గొన్నారు.

చదరంగం పోటీల్లో విద్యార్థిని ప్రతిభ



గుడివాడ టౌన్: చదరంగం పోటీల్లో తమ విద్యార్థిని ఆర్. గౌరీ ఇషిత తన ప్రతిభను ప్రదర్శించి బహుమతి సాధించిందని కేకేఆర్ గౌతమ్స్ హైస్కూల్ ప్రిన్సిపాల్ పి. లక్ష్మీ ప్రసాద్ తెలిపారు. శనివారం విజయం సాధించిన గౌరీ ఇషితను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎన్టీఆర్ స్టేడియం ఆధ్వర్యంలో నిర్వహించిన చదరంగం పోటీలో తమ విద్యార్థిని ద్వితీయ స్థానం సాధించి పతకాన్ని పొందారన్నారు. కోచ్ స్వర్ణలత, గౌరీ ఇషితను పాఠశాల ప్రిన్సిపాల్స్ ఎం. సత్యారామ్, జ్యోతి, ప్రశాంతి అభినందించారు.

ప్రజాప్రతినిధులను అగౌరపరిస్తే సహించేది లేదు



పమిడిముక్కల: అభివృద్ధి పనులు, ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వకపోవడం, ప్రొటోకాల్ పాటించకపోతే సహించేది లేదని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా ఉద్యోగులను హెచ్చరించారు. తమతో సంప్రదించకుండానే గ్రామసభలు జరుపుతున్నారని, అభివృద్ధి పనులు వివరాలు చెప్పడం లేదని, తాము ఫోన్ చేస్తే కార్యదర్శులు స్పందించడం లేదని పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ కాసాని వేద సుప్రజ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని ప్రజాప్రతినిధులను గ్రామాల్లో సమస్యలు తెలుసుకున్నారు. రెండున్నరేళ్లుగా చేసిన పనులకు బిల్లులు ఇవ్వడం లేదని, ఎంబుక్ కనబడటంలేదని చెబుతున్నారని, ఎంపీటీసీ సభ్యుల గౌరవవేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని పలువురు ప్రజాప్రతినిధులు కోరారు. మండలంలో రూ.6.29కోట్లతో 117 సీసీ రోడ్లు నిర్మించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. మండలానికి రూ.2.50 కోట్లు ఆర్ అండ్‌బీ నిధులు మంజూరయ్యాయని, రహదారుల అభివృద్ధికి చర్యలు తీసుకొంటామన్నారు. ఎంపీపీ సుప్రజ, జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటరమణకుమారి, వైస్ ఎంపీపీలు మహేష్, సీతారామయ్య, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, డీవైఈఓ పద్మారాణి పాల్గొన్నారు.

భక్తుల కోర్కెలు తీర్చే వీరమ్మ తల్లి

- అమ్మవారిది వందేళ్ల చరిత్ర
- రేపు వీరమ్మ తల్లి సంబరాలు



చిత్తర్వు వంశీయుల ఇంటి ఎదుట వీరమ్మ ఊరేగింపు (ఫైల్)

గుడ్లవల్లేరు: వందేళ్ల పైబడి చరిత్ర కలిగిన మామిడికోళ్ల శ్రీ వీరమ్మ తల్లి అమ్మవారి సంబరాలు సోమవారం జరుగనున్నాయి. అమ్మవారిని దర్శించుకునేందుకు హైదరాబాదు, విజయవాడ, వైజాగ్, నాగాయలంక, ఏలూరు, కైకలూరు, భీమవరంతోపాటు జిల్లాలో నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు విచ్చేయనున్నారు. అన్నసమారాధన, అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇప్పటికే అమ్మవారి ఆలయానికి విద్యుద్దీపాలంకరణ చేస్తున్నారు. అమ్మవారిని ప్రతిష్ఠించిన తోట దేవుడి భద్రయ్యను కూడా ఇక్కడి ఆరాధ్య దైవంగా కొలుస్తారు. అమ్మవారి వద్ద మొక్కులు తీర్చుకునేందుకు సంప్రదాయబద్ధంగా మహిళలు పాలు పొంగళ్లను అమ్మవారికి సమర్పిస్తారు. సంబరాల ఏర్పాట్లను ఆలయ పారంపర్య నిర్వాహకుడు మండా రాంబాబు పర్యవేక్షిస్తున్నారు. ఈ సంబరాల సందర్భంగా నిర్వహించే పోతురాజు విన్యాసాలు భక్తులను ఆకట్టుకుంటాయి. అమ్మవారితో పాటు దేవుడి భద్రయ్య చిత్రపటం ఊరేగింపు చేపడతారు. పూర్వ కాలం నుంచి మామిడికోళ్ల జమీందారులు చిత్తర్వు వంశీయులు ఇంటి ఎదుట నుంచి అమ్మవారి ఊరేగింపును నిర్వహించటం ఊరంతా పాడిపంటలతో సుఖ శాంతులతో వర్ధిల్లుతుందని స్థానిక భక్తులు భావిస్తున్నారు.

అమ్మవారి కార్యక్రమాలు ఇవి..

అమ్మవారి ఆలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు గద్దె పూజ నిర్వహించనున్నారు. 11గంటలకు వీరమ్మ తల్లిని గ్రామ చెరువులో స్నానం చేయించి పుట్టింటికి తీసుకెళ్తారు. మధ్యాహ్నం మూడు గంటలకు జమ్మి పూజ జరుగుతుంది. సాయంత్రం 6 గంటలకు వీరమ్మ తల్లి ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహిస్తారు. రాత్రి 10గంటలకు రంగు రంగుల విద్యుద్దీపాలంకరణతో అంగరంగ వైభవంగా వీరమ్మ తల్లి ప్రభలను ఊరేగించి భక్తులు తమ మొక్కులను తీర్చుకోనున్నారు. తొలుత దేవుడి భద్రయ్య ప్రభకు ఈ ఊరేగింపులో అగ్ర స్థానం ఇవ్వటం ఇక్కడి సంప్రదాయం. నూతనంగా నిర్మించిన శ్రీ వీరమ్మ తల్లి ఆలయంలో అమ్మవారి పునః ప్రతిష్ఠను సంబరాల రోజునే 17వ తేదీన గ్రామస్తుల సంయుక్త సహకారంతో ఆలయ కమిటీ వారు నిర్వహించనున్నారు.



నూతనంగా నిర్మించిన వీరమ్మ తల్లి ఆలయం

మిన్నగా సంబరాలు



వీరమ్మ తల్లి అమ్మవారి నూతన ఆలయాన్ని గ్రామస్తులంతా సమష్టి సహకారంతో నిర్మించారు. ఈ ఆలయంతో నూతన శోభ ఏర్పడింది. ఈ నూతనోత్తేజంతో ఈ సారి సంబరాలు గతంలో కంటే మిన్నగా జరగనున్నాయి. ఈ సారి సంబరాల్లో భక్తుల సంఖ్య కూడా పెరగనుంది.

– కూసం హనుమప్రసాద్, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యుడు

ఘనంగా ప్రభల ఊరేగింపు



అమ్మవారి ప్రభలతో పాటు దేవుడి భద్రయ్య చిత్రపటం ఊరేగింపు ఘనంగా చేపడతారు. అమ్మవారిని స్నానం చేయించి, వందేళ్ల సంస్కృతీ సాంప్రదాయాల్ని తలపిస్తూ పుట్టింటికి తీసుకెళ్తారు. పూర్వ కాలం నుంచి మామిడికోళ్ల జమీందారులు చిత్తర్వు వంశీయులు ఇంటి ఎదుట నుంచి అమ్మవారి ఊరేగింపును నిర్వహించటం ఆనవాయితీ.

– మండా రాంబాబు, ఆలయ వంశపారంపర్య నిర్వాహకుడు

‘పది’ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

పామర్రు: పదోతరగతి పరీక్షలు పటిష్టంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పామర్రు ఎంఈఓ–2 జీ పద్మవాణి పేర్కొన్నారు. శనివారం మండల రిసోర్సు పర్సన్ కేంద్రంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 17 నుంచి 31వ తేదీ వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ పరీక్షల నిర్వహణ కోసం మండలంలోని ఐదు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పామర్రు జెడ్పీ హైస్కూల్, అసీసీ హైస్కూల్, ఏఎస్ఎం హైస్కూల్, మండల పరిధి అడ్డాడ జెడ్పీ హైస్కూల్, నిమ్మకూరులోని ఏపీ రెసిడెన్షియల్ స్కూల్లో కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యార్థులు 759 మంది పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ఈ నెల 31వ తేదీ వరకు షెడ్యూల్ ప్రకటించారని, ఒక వేళ 31న రంజాన్ పర్వదినం వస్తే ఆరోజు నిర్వహించాల్సిన పరీక్షను ఏప్రిల్ ఒకటో తేదీన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

పోలీస్ స్టేషన్‌కు చేరిన ప్రశ్నపత్రాలు

పదో తరగతి పరీక్షలకు సంబంధించిన కాన్ఫిడెన్షియల్ మెటీరియల్, ప్రశ్నపత్రాలను పామర్రు పోలీస్‌స్టేషన్ లాకర్లలో భద్ర పర్చినట్లు ఎంఈఓ తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, వైద్య సౌకర్యాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. విద్యార్థులు పరీక్ష సమయానికి అర్ధగంట ముందుగా వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.



పామర్రు పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న ప్రశ్న పత్రాలు

మొవ్వలో..

మొవ్వ: పది పరీక్షలకు సంబంధించి మండలంలో ఆరు కేంద్రాలను సిద్ధం చేసినట్లు మండల విద్యాశాఖ అధికారులు ఎం.శివ శంకరరావు, కే శ్రీలక్ష్మి తెలిపారు. ఈ పరీక్షలకు 9 ప్రభుత్వ పాఠశాలలు 5 ప్రైవేట్ పాఠశాలలతో కలిపి 530 మంది పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్

కైకలూరు: ప్రజలు ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత అలవర్చుకోవాలని వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. శనివారం కోట కలిదిండి గ్రామంలో ఆది వినాయక స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు వడుపు రామారావు, నాయకులు పోసిన చెంచురామారావు, మేడిం వెంకటేశ్వరరావు, చిట్టూరి పరుశురాం, గండికోట వెంకటేశ్వరరావు, పోతురాజు లక్ష్మణరావు, వడుపు భోగేశ్వరరావు, మంగిన భాస్కర్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



కోట కలిదిండిలో విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న డీఎన్నార్

ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధిస్తాం

పామర్రు: పర్యావరణానికి ప్రమాదమైన ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించేందుకు అందరూ కలిసి పని చేద్దామని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. స్థానిక నాలుగురోడ్ల కూడలి వద్ద స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర.. ప్లాస్టిక్‌ను నివారిద్దాం, పర్యావరణాన్ని కాపడుకుందాం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణే మనందరి బాధ్యతగా వ్యవహరించాలన్నారు. విద్యార్థులు గ్రామ పురవీధుల్లో ప్లాస్టిక్ వినియోగం నిషేధంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం అందరూ కలిసి ప్లాస్టిక్ నిరోధించాలని ప్రతిజ్ఞ చేశారు. కృష్ణా జిల్లా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ వల్లూరి పల్లి గణేష్, ఎంపీడీఓ కె జ్యోతి, ఐకేపీ ఏపీఎం తిరపతమ్మ పాల్గొన్నారు.

పెరికెగూడెంలో..

మండవల్లి: స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా పెరికెగూడెంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ గురించి గ్రామస్తులకు శనివారం అవగాహన కల్పించారు. సర్పంచ్ పెరుమాళ్ళ పద్మ ఆధ్వర్యంలో ర్యాలీగా స్కూళ్లకి, కిరాణాషాపుల వద్దకు వెళ్లి అవగాహన కల్పించారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమాలు శనివారం నిర్వహించారు. పెదపాలపర్రు, చినకామనపూడి, వడాలి గ్రామాల్లో సర్పంచ్‌లు గంటా రాకేష్‌కుమార్, చిట్టూరి నాంచారయ్య, మరీదు దుర్గశ్రీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు, పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు, ఆశవర్కర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొనగా వీరితో ప్రతిజ్ఞ చేయించారు.



పళ్ల వ్యాపారికి ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా

ప్లాస్టిక్ వ్యర్థాలు నిర్మూలించండి

మండవల్లి: ప్లాస్టిక్ వ్యర్థాలు నిర్మూలించి ప్రకృతిని కాపాడాలని కై కలూరు సీఐ వి రవికుమార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. తొలుత స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కళాశాల విద్యార్థులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ బేతపూడి రవితేజ, అధ్యాపకులు పాల్గొన్నారు. కానుకొల్లులో సర్పంచ్ నాగదాసి థామస్ ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు.

గుడివాడలో..

గుడివాడ టౌన్: ప్రజలందరూ కలిసి సంకల్పిస్తే స్వచ్ఛ గుడివాడ రూపకల్పన సాధ్యమేనని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. శనివారం గుడివాడ పురపాలక సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ పార్కులో స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. తొలుత మున్సిపల్ సిబ్బంది, మెప్మా సిబ్బంది పార్కులో శ్రమదానం చేశారు. మున్సిపల్ కమిషనర్ బి. శ్రీనివాసరావు, శానిటరి ఇన్‌స్పెక్టర్ అప్పారావు, తదితరులు పాల్గొన్నారు. స్థానిక బాపూజీ నగర్ లోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో వైద్యులు, ఉద్యోగులు శ్రమదానం చేసి స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. డాక్టర్ జాన్ డేవిడ్ ట్విన్సన్, సీడీపీఓ విజయా ఫ్లారెన్స్, సూపర్‌వైజర్ భవాని, వి. రామారావు పాల్గొన్నారు.



గుడివాడలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే రాము

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్‌పై గుడ్లవల్లేరులో అవగాహన ర్యాలీతో పాటు మానవహారాన్ని శనివారం ఎంపీడీఓ టి.విజయసారథి, ప్రత్యేకాధికారి టి.పార్థసారథి ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామ కార్యదర్శి జె.నరసింహారావు, గ్రామ సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు. ఉలవలపూడిలో సర్పంచ్ పామర్తి కన్య భాస్కరరావు చేతుల మీదుగా మహిళలకు తడి, పొడి చెత్తకు సంబంధించిన డస్ట్‌బిన్‌లను అందజేశారు.

క్యారీ బ్యాగులను విక్రయిస్తే చర్యలు

కైకలూరు: పర్యావరణానికి విఘాతం కలిగించే క్యారీ బ్యాగులను దుకాణదారులు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దారు ఎండీ ఇబ్రహీం హెచ్చరించారు. స్వర్ణాంధ్ర–స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా కై కలూరు రెవెన్యూ, పంచాయతీ శాఖల ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులతో కలసి ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై శనివారం ర్యాలీ నిర్వహించారు. తొలుత పంచాయతీ కార్యాలయం వద్ద అందరితో ప్రతిజ్ఞ చేయించారు. పంచాయతీ కార్యదర్శి ప్రత్తిపాటి ఆనంద్ భూషణం, ఏపీఓ చరణ్, ఎండీ బాబు పాల్గొన్నారు.

కాటన్ బ్యాగుల పంపిణీ

ఆటపాక పంచాయతీ కార్యాలయం వద్ద స్వర్ణాంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ తలారి మణిమ్మ, సెక్రటరీ కిరణ్ ఆధ్వర్యంలో ప్రజలకు కాటన్ బ్యాగులను పంపిణీ చేశారు.

స్వచ్ఛ ఆంధ్రలో ప్రజలు భాగస్వాములు కావాలి

తోట్లవల్లూరు: స్వచ్ఛ ఆంధ్రలో ప్రజలు భాగస్వాములు కావాలని రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి పిలుపునిచ్చారు. తోట్లవల్లూరులో స్వచ్ఛ ఆంధ్ర– స్వచ్ఛ దివస్ కార్యక్రమం శనివారం జరిగింది. స్థానిక వేణుగోపాలస్వామి ఆలయం వద్ద జంగిల్ క్లియరెన్స్ నిర్వహించటంతోపాటు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ సభ, ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఉయ్యూరు డివిజినల్ డెవలప్‌మెంట్ అధికారి రాజేష్, సర్పంచ్ పెనుమత్స రాధిక, ఎంపీడీఓ రవికాంత్, పంచాయతీ కార్యదర్శి రవికుమార్ పాల్గొన్నారు.

మండవల్లిలో..

మండవల్లి: మండవల్లిలో సర్పంచ్ మెండా ఝాన్సీ అధ్యక్షతన కార్యదర్శి గిరిజాకుమారి ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. సుధామ ఫౌండేషన్ అధినేత ప్రొఫెసర్ సూదాబత్తుల విజయ్‌కుమార్, నాయకులు మెండా సురేష్, సత్తిబాబు, గణేష్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



మండవల్లి కళాశాల్లో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో సీఐ రవికుమార్, ప్రిన్సిపాల్ రవితేజ



కైకలూరులో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

కపిలేశ్వరపురంలో..

పమిడిముక్కల: కపిలేశ్వరపురంలో పీహెచ్‌సీ ఉద్యోగులు స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీ నిర్వహించారు. సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి ప్రసాద్, అంగనవాడీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మొవ్వలో..

మొవ్వ: స్వచ్ఛ ఆంధ్ర–స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాన్ని పురస్కరించుకుని శనివారం పారిశుద్ధ్య కార్మికులతో కలిసి అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామ సర్పంచ్ తూము పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. మానవహారాన్ని ఏర్పాటుచేసి ప్రతిజ్ఞ చేయించారు. మండల అధికారులు పాల్గొన్నారు.

యలమర్రులో..

యలమర్రు(పెదపారుపూడి): ప్రతి ఒక్కరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ టీ. సీతామహాలక్ష్మి అన్నారు. మండలంలోని యలమర్రులో శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈఓపీఆర్డీ వంగా శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి చైతన్య శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

■ ఆలయ జీర్ణోద్ధరణ పూజలు ప్రారంభం

గుడ్లవల్లేరు: స్థానిక శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయ జీర్ణోద్ధరణ పూజలను శనివారం వేద పండితులు ప్రారంభించారు. ఈ పూజల్లో గుడ్లవల్లేరు ఎస్ఈఆర్ఎం విద్యా సంస్థల చైర్మన్ వల్లభనేని వెంకట్రావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కొనరాజు బాపయ్య చౌదరి, నెహ్రూ పశువుల సంత కమిటీ అధ్యక్షుడు వల్లభనేని సుబ్బారావు, కార్యదర్శి ఈడ్పుగంటి ఉమా, గ్రామ ప్రముఖుడు పొట్లూరి సత్యనారాయణ, ఆలయ ధర్మకర్తలు కొప్పురావూరి రవి, మురాల నరేష్ పాల్గొన్నారు.

■ నేడు కేంద్ర ప్రాంతీయ వార్తా విభాగాధిపతి రాక

గుడ్లవల్లేరు: మండలంలోని సింగలూరుకు విజయవాడ దూరదర్శన్‌కు చెందిన ప్రసార భారతి కేంద్ర ప్రాంతీయ వార్తా విభాగాధిపతి, ఉప సంచాలకులు డాక్టర్ జి.కొండలరావు ఆదివారం రానున్నారు. ఈ విషయాన్ని ప్రముఖ సంఘ సేవకుడు డాక్టర్ బండారు శ్యామ్‌కుమార్ శనివారం విలేకరులకు తెలిపారు.

■ కొనుగోలు కేంద్రాలను కొనసాగించాలి



గుడ్లవల్లేరు: ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం కొనసాగించాలని సీపీఎం మండల నాయకుడు బి.వి.శ్రీనివాసరరావు డిమాండ్ చేశారు. ఈ విషయమై విన్నకోటలో ఆయన ఆధ్వర్యంలో శనివారం రైతులతో కలిసి నిరసన చేపట్టారు. విన్నకోటలోనే ధాన్యం ఇంకా 30శాతం మిగిలిపోయిందని ఆయన తెలిపారు. ఏప్రిల్, మే నెలాఖరు వరకు కొనుగోలు కేంద్రాలు కొనసాగించాలని కోరారు. మినుము రూ.9,200 గతేడాది రేటుకు బోనస్ ఇచ్చి ప్రభుత్వం కొనుగోలు చేయాలని కోరారు. రైతు సంఘ మండల నాయకుడు డాక్టర్ రోంపిచెర్ల జోత్స్నాసత్యమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు మేలు చేసేలా ఉండాలన్నారు. రైతులు, కౌలు రైతులు పాల్గొన్నారు

■ హాల్ టికెట్ల పంపిణీ

మండవల్లి: చింతపాడు హైస్కూల్లో శనివారం పదో తరగతి విద్యార్థులకు హాల్ టికెట్లు, ప్యాడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 10వ తరగతిలో ఉత్తీర్ణత సాధించేందుకు అవసరమైన సలహాలు, సూచనలు ఉపాధ్యాయులు, నాయకులు అందజేశారు.

■ బడ్డీ కొట్టు ఏర్పాటును అడ్డుకోవాలి

తోట్లవల్లూరు: ఇరిగేషన్ స్థలాన్ని ఆక్రమంచి బడ్డీ కొట్టు ఏర్పాటు చేసే పనులు మండలంలోని చినపులిపాకలో వివాదాస్పదంగా మారాయి. స్థానిక వంతెన మలుపు వద్ద ఇరిగేషన్ స్థలంలో ఓ వ్యక్తి కొన్ని రోజులుగా బడ్డీ కొట్టు ఏర్పాటు పనులు నిర్వహిస్తున్నాడు. చినపులిపాక–కంకిపాడు ప్రధాన రహదారి మలుపులో గతంలో చిన్న హోటల్ ఉండేది. ఇటీవల దానిని బడ్డీ కొట్టుగా రేకులతో నిర్మిస్తున్నారు. బడ్డీ కొట్టు ఏర్పాటు వలన ఆర్టీసీ బస్సులు, లారీల రాకపోకలకు ఇబ్బందికరంగా మారుతుందని గ్రామస్తులు అంటున్నారు. ఇరిగేషన్ అధికారులు స్పందించి వాహనాల రవాణకు ఇబ్బందికరంగా మారనున్న బడ్డీ కొట్టు ఏర్పాటును అడ్డుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై కంకిపాడు ఇరిగేషన్ ఏఈఈ నాగబాబుని వివరణ కోరగా బడ్డీ కొట్టు ఏర్పాటు చేయవద్దని నిర్వాహకుడికి నోటీసు జారీ చేశామని తెలిపారు.

■ ఉచిత కంటి వైద్యశిబిరం

గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ సేవాభవన్‌లో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఆ క్లబ్ చైర్మన్ శశికళ ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

■ వినియోగదారుడు బిల్లు పొందాలి

కైకలూరు: ప్రతి వస్తువు కొనుగోలు చేసినప్పుడు కచ్చితంగా బిల్లు తీసుకోవాలని న్యాయవాది మేడిశెట్టి పాములు పేర్కొన్నారు. ప్రపంచ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా శనివారం వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో కామర్స్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీలత, కామర్స్ అధ్యాపకులు నున్న శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ డి.ఉదయప్రకాష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

■ ఫార్మసీ విద్యార్థుల విజయం

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు వీవీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాల విద్యార్థులు ఈ నెల 12, 13 తేదీల్లో కె.వి.ఎస్.ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాల వారు నిర్వహించిన జాతీయ ఎస్పీటీపీఎస్ యుటోరియా 2025లో సాంస్కృతిక, క్రీడా పోటీల్లో పాల్గొని విజయం సాధించారు. ఈ విషయాన్ని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు శనివారం విలేకరులకు తెలిపారు.

■ వీరమ్మ తల్లి పునఃప్రతిష్ట ఉత్సవాలు ప్రారంభం

గుడ్లవల్లేరు: మామిడికోళ్లలో నూతనంగా నిర్మించిన శ్రీ వీరమ్మ తల్లి ఆలయంలో అమ్మవారి పునః ప్రతిష్ట ఉత్సవాలను శనివారం ప్రారంభించారు. గోపూజ, యాగశాల ప్రవేశం, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచన, పంచగవ్యం, మార్జనలు, దీక్షాధారణ, అఖండ స్థాపన తదితర ప్రత్యేక పూజాదికాలు, హోమాలను వేద పండితులు వేద మంత్రోచ్చరణ నడుమ చేపట్టారు. ఆలయ వంశపారంపర్య నిర్వాహకుడు మండా రాంబాబు, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు జెట్టి శ్రీరాం, చావా నాగేశ్వరరావు, కూసం హనుమప్రసాద్, తోట ఈశ్వరరావు, వెంకటేశ్వరరావు, నరేంద్ర, మల్లికార్జునరావు, కౌశిక్, సుభాష్ పాల్గొన్నారు.